# త్వరలో కథ

త్వరలో కథపంపించమని పత్రిక నుంచీ—
త్వరలో పెళ్ళాన్ని కాపురానికి పంపించమని అల్లుడి దగ్గర్నుంచీ—
త్వరలో నాలుగు వేలూ పంపించమని మేనమామ దగ్గర్నుంచీ—
త్వరలో లంక పొగాకు కట్టలు పంపమని తండ్రి దగ్గర్నుంచీ—
త్వరలో సేల్స్ రిపోర్ట్ పంపమని హెడ్డాఫీసునుంచీ—
త్వరలో ఎక్స్‌రే రిపోర్టు పంపమని పెళ్ళాం దగ్గర్నుంచీ—

ఉత్తరాలు వచ్చాయి సన్యాసిరాజుకి. సన్యాసిరాజుదేశం దృష్టిలో మంచి రచయిత. అల్లుడి దృష్టిలో చెడ్డ మామగారు. మేనమామ దృష్టిలో నిర్వాకం చెయ్యలేని అసమర్థుడు. తండ్రి దృష్టిలో మతిమరుపు మనిషి. ఆఫీసు దృష్టిలో నమ్మకస్తుడు, కాని బాక్ నంబర్. పెళ్ళాం దృష్టిలో ఆర్భకం మనిషి, కాని మంచి మనిషి.

సన్యాసి రాజుని పదిహేనో ఏట ఎవరయినా ' నీ జీవిత లక్ష్యం ఏమిటి?" అని అడిగివుంటే?

—విశాఖ పట్నం హిందుస్తాన్ షిప్ యార్డ్‌లో గుమాస్తా అవాలనీ—
—ఎదురింటి వెంకట నర్సుని పెళ్ళి చేసుకోవాలనీ—
—400 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో పరుగు తీయాలనీ

ఇలాంటివి చెప్పేవాడు. ఈ లిస్టులో ఎక్కడా, ఏకోశానా రచయిత అవాలనే

కోరికగాని, లక్ష్యం గానీ కనిపించదు. వాళ్ళ అమ్మకి అతను ఏకైక సంతానం. ఎప్పుడు తన కళ్ళముందే కొడుకు ఉండాలనే ఆమె కోరికకి తన లక్ష్యాన్ని కుదించుకుని హిందూస్తాన్ షిప్ యార్డ్‌లో గుమస్తాగిరీతో రాజీపడ్డాడు. (రాజీ పడ్డాడనడం తప్పు మాట. ఆ పదవికోసం కలలు కన్నాడు) ఎదురుగా ఉన్న తాసీల్దారుగారమ్మాయి చాలా అందంగా ఉంటుందని అతనికి పదేళ్ళప్పటి నుంచీ నమ్మకం. ఆ నమ్మకాన్ని అలా మరో పదేళ్ళు అభివృద్ధి చేసుకొని అందం పట్ల తన అభిప్రాయాన్ని ఆశరీరంలోకి కుదించాడు. కానీ తాసీల్దారు గారి బావమరిది– మిలటరీ లో ఆఫీసు కమాడింగ్ పదవిలో ఉంటూ – ఓసారి శలవలకి వచ్చి హఠాత్తుగా ఆమెను పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయాక– రెండు లోపాలు సన్యాసిరాజుకి అర్థమయాయి. తన ప్రేమ గురించి ఆమెతో తనెప్పుడూ చెప్పలేదని, తన ప్రేమ అంతస్థు వెంకట నర్సును పెళ్ళి చేసుకోవడానికి చాలలేదనీను. ఒకసారి స్కూల్లో 400 మీటర్ల పరుగు పందెంలో టీచరు చొక్కా పట్టుకొని గ్రౌండులో నిలబెడితే పరిగెత్తాడు. అనుకోకుండా, ఎవరూ ఊహించనట్టుగా– రెండో స్థానంలో నెగ్గుకొచ్చాడు. 11 నెలలు పరుగు పందాల్లో బహుమతులు పుచ్చుకోవడం, స్కూలు స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో బహుమతులు పొందడంగురించి ఊహించుకుని చాంపియన్‌గా తన ఫోటోలు పేపర్‌లో పడడానికి మనస్సులో అందమయిన రూపం దిద్దుకొన్నాడు. కాని తరువాత రెండు సంవత్సరాలు వరసగా తన కంటే కనీసం నలుగురు ముందు పరిగెత్తడం గమనించి ఆ కలని బ్రేక్ వాన్‌లో పారేశాడు. ఇలా జీవితాన్ని ప్రతి దశలోనూ, పరిస్థితుల పరిణామాల దృష్ట్యా సవరించుకొంటూ– అలా సవరించుకొన్నందుకు ఆశాభంగం చెందక ముందుకు సాగిపోయే మధ్య తరగతి మంచి వాడు సన్యాసి రాజు.

మరి రచయిత ఎలా అయాడు? తన జీవితంలో కన్న అందమయిన కలలు చెదిరి పోవడాన్ని, వాటిని తను ఎప్పటికప్పుడు సవరించుకోవడాన్నీ– తరుచు మిత్రులతో చెప్తున్నప్పుడు, వాళ్ళు అతను గడిపే జీవితం కంటే, గడపాలనుకున్న జీవితం అందంగా ఉండడం గమనించారు. ఆ జీవితాన్ని అందంగా చెప్పగల అతని నేర్పుని గుర్తుపట్టారు. కొందరు రచయితలు తమ అనుభవాన్ని అందంగా చెప్తారు. మరికొందరు తమ అనుభవంలోకి రాని అనుభవాన్ని అందంగా ఊహించుకుని చెప్తారు. కొందరు రచయితల సాహిత్యం వారి జీవితాలకి దర్పణం. మరికొందరి జీవితాలకి విపర్యయం. ఏమయితేనేం! సన్యాసిరాజుకి పెళ్ళయి పెద్ద కూతురు పుట్టి, రెండో పిల్ల పురిట్లోనే చచ్చిపోయి, పెళ్ళానికి టి.బీఅని డాక్టర్లు తేల్చినప్పుడు, ప్రావిడెంటు ఫండు డబ్బంతా వాడేసి, యింకా ఎక్కడినుంచి డబ్బు తేవాలో తెలీక మేనమామ ఇచ్చేఅప్పుసొమ్ముకూడా అవధులు దాటిపోయిందని తెలిసినప్పుడు – అప్పటికి సన్యాసిరాజుకి 32 సంవత్సరాలు – అప్పుడు ఓ మిత్రుడు సూచనగా అన్నాడు:

"మైడియర్ సన్యాసిరావ్– నువ్వు హిందూస్తాన్ షిప్‌యార్డ్ గుమస్తా అవాలనుకొన్న అనుభవం కథగా రాస్తే బాగుంటుంది. వై డోంట్ యూ రైట్?" అని.

సన్యాసి రాజు నవ్వుకున్నాడు. రచనలు చెయ్యడానికి కష్టమేం కాదు.కష్టాన్ని

కళాత్మకంగా మలచగల దృష్టి, మలిచే వ్యవధీ కావాలి. కావాలని అప్పట్లో సన్యాసి రాజుకి తెలీదు. కానీ పెళ్ళాం ఎక్స్‌రేకి డబ్బు కావాలని తెలుసు. అవసరం మనిషిని కార్యోన్ముఖుడిని చేస్తుంది. పెళ్ళాం మంచం పక్కన కూర్చుని సన్యాసిరాజు మొదటిసారిగా కేవలం తెలుగు భాషలో తన మొదటి కలని కాగితంమీద రాశాడు. దానికి శీర్షికా 'మొదటి కల' అనే వుంచాడు. ఆ కలని కథగా పత్రికా సంపాదకులు గుర్తు పట్టడానికి రెండేళ్ళు పట్టింది. అప్పటికి టీ.బీ ముదరడం, మరో రెండు కలలు కాగితం మీదకి రావడం, రచయిత కావాలన్న కోర్కె యధాప్రకారంగా బ్రేక్ వాన్‌లో చేరడం జరిగిపోయింది.

మొదటి కలకి పదిహేను రూపాయలు పంపారు పత్రికవాళ్ళు. మొదటి ఇంజెక్షన్ పెళ్ళానికి యిప్పించాడు. అప్పటికి విశాఖ పట్నం మున్సిపాలిటీలో బిల్ క్లర్క్‌గా ఉద్యోగం స్థిరపడింది సన్యాసిరాజుకి. అంతేగాక పెళ్ళాం టీ.బీ, మేనమామ నాలుగు వేల అప్పు, తను రచయితగా ఏదో కాస్త సంపాదించవచ్చునేమోనన్న బలహీనమయిన ఆశా స్థిరపడ్డాయి. రచనలు సమాజశ్రేయస్సుకీ, వర్గ పోరాటాన్ని సమర్థించడానికీ, బూర్జువా వ్యవస్థ కూలదొయ్యడానికీ ఉపయోగిస్తాయన్న ఆలోచన, లక్ష్యం ఇలాంటివేవీ లేవు సన్యాసిరాజుకి. కథ తన కల – దాని ఖరీదు పదిహేను. దానివల్ల ఏ కాస్తో తన పెళ్ళాం రోగం కుదురుతుంది. ఇదీ సన్యాసిరాజు జీవితానుభవంలో సాహిత్య ప్రయోజనం.

జీవితంలో అవకతవకలు పలచబడుతున్నకొద్దీ– వాటి కథలు గడుసుగా, ఆరోగ్యంగా, నిండుగా రూపం దిద్దుకోవడం క్రమేపీ అతను గ్రహించాడు. కల ఒక్కంటికీ పదిహేను రూపాయలు పెరిగి పెరిగి వంద రూపాయల వరకు గిట్టుబాటు కావడం ప్రారంభించింది. అతనిలో బిల్ క్లర్క్ మెల్లగా వెనకసీటు తీసుకొన్నాడు.

ఓసారి మున్సిపల్ ఆఫీసు హెడ్ క్లర్క్ రెండు బిల్లుల వెనకాల – ఓ కథ మొదటి భాగాన్ని చదివి, కథ బాగుందని ఆనందించి, ఉద్యోగ ధర్మం మరిచిపోయినందున విచారించి అతనికి మెమో యిచ్చాడు. అలా అయిదు సార్లు జరగడం, ఆరోసారి ఉద్యోగం పోవడం జరిగింది. అప్పటికి భార్యకు ఊపిరి తిత్తి ఆపరేషన్‌కి వచ్చింది.

అప్పుడు పిల్లనిచ్చిన మేనమామ, అతనికి జన్మనిచ్చిన తండ్రీ ఊరు నుంచి వచ్చారు. (అతన్ని కలకాలం హిందూస్థాన్ షిప్ యార్డ్‌లో గుమాస్తాగా చూడాలని ఆశించిన తల్లి– అతనింకా ఉద్యోగంలో చేరక ముందే కన్ను మూసింది) అతని కష్టాల్ని చూసి చూపడానికి కావాల్సినంత సానుభూతి వాళ్ళిద్దరి దగ్గరా వుంది, కానీ తీర్చడానికి కావలసిన పైకం ఇద్దరి దగ్గరా లేదు. మేనమామకి ఒక్కతే కూతురు వుంది. ఆ కూతురుకిప్పుడు ఒక్క ఊపిరి తిత్తి సరిగాలేదు. తల తాకట్టు పెట్టి ముసలాళ్ళిద్దరూ కలిసి సన్యాసిరాజు పెళ్ళానికి ఆపరేషన్ చేయించి, మానసికంగా కూలిపోయిన అతని వ్యక్తిత్వాన్ని కాస్త పూటీలతో నిలబెట్టి, 'భార్య' అని పిలవడానికి యోగ్యమయిన ఒక శాల్తీని బతికించి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఉండటానికి మనసు రాక కాదు. ఉంటే తమని పోషించే స్తోమతే అతనికి

లేదని గ్రహించిన వాళ్ళు కనక. అప్పటికి కూతురు సమర్తాడి ముల్లు అవుతోంది. ఇదిగో, ఈ రోజుల్లో సన్యాసిరాజు సాహితీ వ్యవసాయం కొత్త మలుపు తిరిగింది. జీవితంలో కన్న కలలన్నీ ఖర్చయిపోయి, అనుభవాల ముమ్మరం పెరిగి, కలలని వాస్తవానికి తర్జుమా చేయడంలో కాఠిన్యత అర్థమయేనాటికి– అతని 'కళ' ఒక బలాన్ని పుంజుకొంది. అతని కథలకి ధర, విలువ పెరిగింది. ఆ రోజుల్లో అతని అవసరాల్ని కొద్దోగొప్పో అతని కళ తీర్చింది. ఏదో ఊసుపోక వ్యాసంగంగా, తన మనస్సులోని ఆలోచనల్ని సమాజానికి పంచే వ్యావృత్తిగా రచనా వ్యావృత్తి అతనికెప్పుడూ లేదు. రచన అతని అవసరాన్ని తీర్చాలి. అది వరకే జీవితంలో బలంగా చోటు చేసుకున్న అనుభూతికి, అతని ఆర్థికమయిన అవసరం పురస్కారమై కథల్ని కుండబద్దలు కొట్టినట్లు రాయించాయి. రాసాడు. సన్యాసి రాజు పాఠక లోకం దృష్టిలో మహా రచయిత అయాడు.

అతని కథని తమ సబ్బుల చుట్టూ ప్యాకింగ్ చేయడానికి కొనే చిత్తు కాగాతాల్లో చూసి పరాకుగా చదివిన సర్వేశ్వరయ్య అతని రచన ఉపయోగాన్ని చిత్తు కాగితాలుగానే కాక – గుర్తు పట్టాడు. ఒక రోజు సబ్బుల అమ్మకానికి షాపులో కూర్చున్న అతనికి సన్యాసిరాజు తారసపడ్డాడు. కిరాణా దుకాణం బాకీ రెండు నెలల్లో తీర్చడానికి బ్రతిమిలాడుతున్న అతన్ని చూసి సర్వేశ్వరయ్య జాలిపడ్డాడు. సబ్బుల కంపెనీలో సేల్స్‌మన్ ఉద్యోగాన్ని డిపాజిట్ కట్టే అవసరం లేకుండా యిప్పించాడు. ఇది సన్యాసిరాజు జీవితంలో తారసపడిన రెండవ సాహితీ ప్రయోజనం. సేల్స్‌మెన్‌గా రాబడి బిల్ కలెక్టర్‌గా రాబడి కంటే కాస్త మెరుగు. అప్పటికి తమ కష్టాల స్థాయికూడా పెరిగింది. కనక యిబ్బందుల స్థాయి మాత్రం తగ్గకుండా యధాప్రకారం–గానే కొత్త ఉద్యోగం ప్రమేయం లేకుండా–ఉండిపోయింది.

ఈ దశలో అతని జీవితంలో జరిగిన మంచిపని పెద్దమ్మాయి పెళ్ళి. మేనమామ తన అసమర్థతను గుర్తుపట్టి, తన మనవరాలు వయస్సు తెలుసుకొని అలా వదిలేస్తే తల్లి బతికుండగా ఆ పిల్ల మెళ్ళో తాళి కట్టించడం జరిగే పని కాదని అర్థం చేసుకొని మరో వెయ్యి రూపాయలు ఆఖరి సారిగా సన్యాసిరాజు కోరకుండానే అప్పిచ్చి ఆ అమ్మాయికి నెర్లిమర్లలో ప్రైమరీ స్కూలు టీచరుగా పనిచేస్తున్న ఓ కుర్రాడికిచ్చి కట్టబెట్టాడు. అప్పట్లో ఆ కుటుంబంలో మరొక శాల్తీని పోషించే బాధ్యతని తప్పించడమే తను చెయ్యగలిగిన ఉపకారంగా భావించాడు మేనమామ.

అప్పట్లో సన్యాసి రాజు జీవితంలో మొదటి, గొప్పకథ రాసి 500 సంపాదించాడు. ఏదో బహుమతి వచ్చింది. అల్లుడికి పంచెలు, కూతురికి చీరెలు, పెళ్ళానికి మొదటిసారిగా వెంకటగిరి చీరె కొన్నాడు. సన్యాసిరాజు జీవితంలో అది ఆకుపచ్చని జ్ఞాపకం.

అంతవరకు అతనెప్పుడు గుర్తు పట్టని విషయం ఒకటి హఠాత్తుగా ఆరోజుల్లో అతనికి తెలిసివచ్చింది. అది అతని ఆరోగ్యం. ఒకరోజు ఉన్నట్టుండి అతని ముక్కులోంచి రక్తం కారింది. అది తెలిసినా భార్య ఆశ్చర్యపడినా, గాభరా పడే ఓపికకూడా లేదని తెలిసి, కారేది

తన రక్తమేకనుక -ఎవరికీ చెప్పకుండా అలా నెలరోజులు వరస తప్పకుండా రక్తాన్ని నష్టపోయి తర్వాత మెల్లగా ఆరోగ్యాన్ని నష్టపోయాడు. తనొక మంచంమీద, పెళ్ళాం ఒక మంచంమీద. తన జబ్బు ఎవరికీ తెలీదు.పెళ్ళాం జబ్బు తనకి తెలుసు. డాక్టరు ఒక పేషెంట్‌కే వైద్యం చేసి వెడుతున్నాడు - రెండో వ్యక్తి పేషంటేనని అతనికెవరూ చెప్పలేదు కనక. ఈ రోజుల్లో చెయ్యి సాయానికి కూతురు పుట్టింటికి వచ్చింది. ఈరోజుల్లోనే సుదూరంలోకి సంక్రాంతి వచ్చింది. సంక్రాంతి ప్రత్యేక సంచికకి కథానికకి ఉత్తరం వచ్చింది. అది మన కథ ప్రారంభం.

ఆ ఉత్తరంతోపాటు మరో అయిదు ఉత్తరాలు వచ్చాయి. మేనమామ ఏకాకి. నాలుగు వేలు యిప్పుడెందుకు?- అర్థం కాలేదు. కాని అది బాకీ. పంపడం ఆనవాయితి. అల్లుడు ఏకాకి? పెళ్ళాం ఎందుకు? అని ప్రశ్నించుకోలేదు. కారణం అర్థమయింది. తండ్రికి లంక పోగాకు. ఈ మధ్య ఉద్యోగం మీద శీతకన్ను వెయ్యక తప్పలేదు. సేల్స్ రిపోర్టు పంపలేదన్న విషయం తనకు తెలుసు. ఇప్పుడు హెడ్డాఫీసు కూడా తెలుసుకొంది. అంతే తేడా. పెళ్ళాన్ని మేనమామ నెల రోజులకిందట వైద్యం చేయిస్తానని తీసుకెళ్ళాడు. కూతురు మాత్రం సమక్షంలో వుంది. పెళ్ళాం దగ్గర లేకపోతే- తన ఊపిరి తిత్తి ఒకటి పోయినట్టు బాధపడ్డాడు సన్యాసి రాజు. వాళ్ళిద్దరి సంసారానికి మూడు ఊపిరితిత్తులు చాలు. కాని తన మనశ్శాంతికి ఆ ఒక్క ఊపిరితిత్తి ఉన్న పెళ్ళామే కావాలి.

కథ రాయాలి. ఏం కథ? కలలు ఖర్చయాయి. అనుభవాలన్నీ ఖర్చయాయి. ప్రత్యేక సంచికకి ప్రత్యేకమయిన కథగా రూపం దిద్దుకునే కల తన దగ్గర లేదు. ఎందుకంటే ప్రత్యేకమైన కష్టం ఏమీ లేదుకనక. కష్టపడ్డమే కాదు, కథగా రూపం దిద్దుకునే ప్రత్యేకమయిన కష్టం దొరక్కే కష్టపడ్డాడు సన్యాసిరాజు.

అతనికిప్పుడు 45. కనురెప్పలు కూడా తెల్లగా పండిపోయాయి. నడుం వంగి చిన్న గూని కూడా వచ్చింది. కూతురు నోరులేని జీవం. సోపుల కంపెనీ ఒకటొక్క ఆధారం. ఇలా ఎన్నేళ్ళు కథల్ని పోషిస్తాడు?-

మొదట అయిదు ఉత్తరాలకి సమాధానం చెప్పాలి-

మొదటి ఉత్తరానికి సమాధానం దొరకదు. కథ గురించి ఆలోచన లేదు సన్యాసిరాజుకి- కథ గురించి ఆలోచించడానికి చిన్న వ్యవధిని సంపాదించుకోడానికి మిగతా అయిదు సమస్యలగురించీ ఆలోచించడం అలవాటు చేసుకున్నాడు.

జీవితానికి ఓ సుగుణం ఉంది. దాని ప్రయాణంలో కొన్ని సమస్యల్ని పోగు చేస్తూ ంటుంది. వాటిని పరిష్కరించుకొంటే ప్రయాణం సౌకర్యవంతం అవుతుంది. పరిష్కరించడంలో ఛాలెంజ్ కొత్త ఆనందాన్ని, గర్వాన్ని యిస్తుంది. పరిష్కరించకపోతే ఏమీ కాదు. ప్రయాణం సాగుతూఉంటుంది. ఆగదు. క్రమంగా సమస్యలు వాటి పరిష్కారాన్ని అవే వెదుక్కొన్నాయి. మరో పది రోజుల్లో మేనమామ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది-

సన్యాసిరాజు పెళ్ళాం చచ్చిపోయిందని. దిమ్ముగా, ఒక్కసారి ఎవరో దొంగదెబ్బ కొట్టినట్టు ఫీలయాడు సన్యాసి రాజు. ఏ ఆలోచనా తోచలేదు. క్రమంగా మనస్సు తేలికయింది. జీవితంలో ఉక్కిరి బిక్కిరి సర్దుకున్నట్టు, ఏదో బరువు దిగిపోయినట్టు అనిపించింది. కూతురు భోరుమంది. సన్యాసిరాజు భోరుమనలేదు. కూతుర్ని ఓదార్చలేదు. ఏడ్చి ఏడ్చి "తాతయ్య యింటినుంచే అలా నెల్లిమర్ల వెళ్ళిపోతాను నాన్నా" అంది. సరేనన్నాడు సన్యాసిరాజు.

భార్య పెద్ద కర్మకి అంతా వచ్చారు- తండ్రి తిరిగి వెళ్తూ- "లంక పొగాకు చుట్టలు యిప్పట్లో అక్కర్లేదురా" అన్నాడు.

ఆ మాట తండ్రి ఎప్పుడూ అనలేదు. ఆయన జీవితంలో చాలా హృద్యంగా దాచుకున్న ఒకే ఒక్క అలవాటు చుట్టలు. సిగ్గు పడ్డాడు సన్యాసిరాజు. "కాస్త వీలు చూసుకుని పంపుతాను నాన్నా" అన్నాడు.

"వద్దులే- గుండె ఎన్‌లార్జ్ అయిందట. చుట్టలు కాలిస్తే చస్తావు అన్నారు డాక్టర్లు. తర్వాత చూసుకుందాం" అని వెళ్ళిపోయాడు తండ్రి.

హెడ్డాఫీసు ఉత్తరం మేనమామ యింటికి డైరెక్టు అయి వచ్చింది. సోపుల కంపెనీ ఎత్తేశారుట-రెండు సమస్యలు తీరిపోయాయి. 1. సేల్స్ రిపోర్టు అవసరం లేదు. 2.ఉద్యోగం చెయ్యక్కర్లేదు.

కర్మ అయిపోయాక వెళ్ళిబోతూ మేనమామతో అన్నాడు. "ఉద్యోగం లేనట్టుంది. మళ్ళీ ఏదయినా వెతుకున్నాక నీ నాలుగు వేలూ"

"ఒరే ఫూల్! నేను నాలుగు వేలూ ఎందుకడిగానో ఎప్పుడయినా ఆలోచించావురా?"

"ఎందుకు?"

"నీ పెళ్ళానికి వైద్యం చేయించడానికి డబ్బు కావాలని నువ్వెప్పుడూ ఆలోచించలేదు. కనీసం నా అప్పు గురించయినా ఆలోచిస్తావని! - నా కూతుర్రు పోయింది. నువ్వు తీర్చినా నాకాడబ్బు అవసరం యిప్పట్లో లేదు."

మనస్సులో చచ్చిపోయిన భార్యకు కృతజ్ఞత చెప్పుకున్నాడు సన్యాసిరాజు. రెండు విధాలుగా ఆ యిల్లాలు తనకి ఉపకారం చేసింది. సమస్యల పరంపరవిడిపోయింది. లేక కష్టాల పరంపర నిలదొక్కుకుందా- ఏమో? ఏమయినా యిప్పుడిక మనస్సు ఖాళీ అయింది. కథ గురించి యింక ఆలోచించే వ్యవధి దొరికింది.

అత్త వారింటినుంచి బయలుదేరుతూ పోస్టాఫీసు దగ్గర ఆగి
త్వరలో కథ పంపుతానని పత్రిక ఆఫీసుకి ఉత్తరం రాశాడు సన్యాసిరాజు. కథ పేరు - త్వరలో కథ.

- ఆంధ్రజ్యోతి వీక్లీ (5.12.1978)